## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాపసముద్రం బాలికల జట్టు

గుడిపాల, జనవరి 31 ప్రభాతవార్త:



చిత్తూరు మెసానికల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా కబడ్డీ బాలికల విభాగం పోటీల్లో గుడిపాల మండలం పాసముద్రం బాలికల కబడ్డీ జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇప్పటికే పాపసముద్రం బాలికల కబడ్డీ జట్టు సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో విజయం సాధించి జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో సైతం విజయం దక్కించుకొని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆడనుంది. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పాపసముద్రం బాలికల కబడ్డీ జట్టుకు సచివాలయ సిబ్బంది జమీలా, మౌనిక, జయకుమార్, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఎంఇఓగా రాజేంద్రన్



పెనుమూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

పెనుమూరు మండల విద్యాశాఖ అధికారిగా ఎన్.రాజేంద్రన్‌ను నియమిస్తూ ఆర్జేడీ వెంకటరామిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రాజేంద్రన్ గురువారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించి విద్యార్థులను భావి పౌరులుగా తీర్చి దిద్దాలన్నారు. ఉపాధ్యాయులకు విద్యాశాఖకు అనుసంధానంగా తాను విధులు నిర్వహిస్తానన్నారు. విద్యాశాఖ పరంగా వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటానన్నారు.

## కుప్పం డిఎస్పీగా శ్రీనాథ్ నియామకం



కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

కుప్పంకు నూతన డిఎస్పీగా బందరు శ్రీనాథ్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డిఎస్పీగా పనిచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన డిఎస్పీల బదిలీల్లో భాగంగా ఆయనను కుప్పంకు బదిలీ చేశారు. అలాగే పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డిని కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ డిఎస్పీగా బదిలీ చేశారు.

## నేటి నుంచి తెదేపా పంచాయతీ సమావేశాలు

రామకుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

మండలంలోని 21 పంచాయతీల్లో శుక్రవారం నుంచి తెలుగుదేశం పార్టీ పంచాయతీ స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. ఈనెల 9వతేది వరకు ఈసమావేశాలు జరుగుతాయన్నారు. పార్టీ పటిష్టత, గ్రామ వికాస పత్రాల తయారీ, పథకాల ప్రచారం తదితర అంశాలపై సమావేశాల్లో చర్చించడం జరుగుతుందన్నారు. పార్టీశ్రేణులుసమావేశాలనువిజయవంతంచేయాలని కోరారు.

## ప్రీమియర్ లీగ్ పోటీల్లో కుప్పం విద్యార్థుల ప్రతిభ

కుప్పంరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



పుంగనూరులో ఇటీవల జరిగిన నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీల్లో కుప్పం నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎజిఎం ఫణికుమార్, ఆర్ఐ ప్రసాద్, ప్రిన్సిపాల్ విజయ్ తెలిపారు. సీనియర్ బాలికల కబడ్డీ, ఖోఖో పోటీల్లో ప్రథమస్థానం, జూనియర్ బాలికల ఖోఖో, సీనియర్ బాలికల త్రోబాల్, వాలీబాల్‌లో మూడో స్థానంలో నిలిచారన్నారు. 100మీ. పరుగుపందెంలో సౌమ్య, 200మీ.లలో ధనుష్ ప్రియ, లాంగ్‌జంప్‌లో చరణ్య మొదటి స్థానాలు సాధించారన్నారు. షాట్‌పుట్‌లో ధనుష్, చక్రి తొలిరెండు స్థానాలు సాధించారన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమలం ఎజిఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా శ్రేణులకు శిక్షణ తరగతులు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు గురువారం కుప్పం పార్టీ కార్యాలయంలో 10,11 క్లస్టర్లకు సంబంధించి పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ, ఓటర్ల పరిశీలనపై అవగాహన కల్పించారు. క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, వార్డుల అధ్యక్షులు, సెక్షన్ ఇన్‌చార్జ్‌లకు శిక్షణ కల్పి ంచారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు సత్యేంద్రశేఖర్, డా॥ వెంకటేష్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి మృతి కేసులో ఐదుగురికి రిమాండ్

సోమల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

ఆవులపల్లి పంచాయతీ దేవళకుప్పం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మంగళవారం రాత్రి విద్యుత్‌షాక్ గురై గంగాధరం మృతి చెందిన విషయం విధితమే. ఈ కేసులో 5గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. మృతుని భార్య నాగవేణి ఫిర్యాదు మేరకు సుధాకర్ నాయుడు, శేషాద్రినాయుడు, మల్లికార్జుననాయుడు, చంద్రానాయుడు, సుందరనాయుడులను అరెస్టు పుంగనూరు కోర్టులో హాజరు పరచారు. వారికి న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వివరించారు.

## ఎంపీడీఓ రమణ ప్రకాష్ బాధ్యతల స్వీకరణ

తవణంపల్లె, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



తవణంపల్లె ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఎంవి.రమణ ప్రకాష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా తవణంపల్లె ఎంపీడీఓగా పనిచేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్ నెల్లూరు జిల్లా సీతారామాపురం మండల ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. దీనితో తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఎంవి.రమణ ప్రకాష్‌ను పూర్తి అదనపు బాధ్యతలతో తవణంపల్లె ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్పీ సీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనగురువారంఎంపీడీఓకార్యాలయంలోబాధ్యతలు స్వీకరించారు.

## జగన్‌ను మరోసారి సిఎం చేయడమే లక్ష్యంగా విధులు

– కార్యకర్తలకు వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్ పిలుపు



యాదమరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

ఐదేళ్ళ పాలనలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా విధులు నిర్వర్తించిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి సిఎం కుర్చీలో కూర్చోబెట్టడమే లక్ష్యంగా నాయకులు, కార్యక ర్తలు పనిచేయాలని పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్ పిలుపునిచ్చారు. యాదమరిలోని శివపార్వతి కళ్యాణ మండపంలో గురువారం జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీ డాక్టర్ సునీల్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ప్రామాణికంగా తీసుకొని పలు సంక్షేమ పథకాలను అమలు చేసి ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మన రాష్ట్రంవైపు చూసేలా చేశారన్నారు. జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశారన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి సురేష్, జిల్లా వైకాపా కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ముస్లీం మైనార్టీల డైరెక్టర్ కబ్బీర్‌భాయ్, మాజీ జడ్పీటీసీ మనోహరన్, వైస్ ఎంపిపిలు రవీంద్రబాబు, హరినారాయణరెడ్డిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, మండల వైకాపా యూత్ కన్వీనర్ కార్తీక్‌రెడ్డి, సేవాదళ్ కన్వీనర్ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం ఆర్థిక బకాయిలు చెల్లింపు

– యుటిఎఫ్ ఆధ్వర్యంలో 2వ రోజు రిలే నిరాహారదీక్ష



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక బకాయిలు చెల్లింపుతో పాటు పాత పెన్షన్ విధానంను సత్వరం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు గురువారం రెండవ రోజుకు చేరాయి. నిరాహారదీక్షా శిబిరంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి జివి రమణలు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవరైనా పాత పెన్షన్ విధానంను పునరుద్ధరిస్తామని హామీ ఇస్తారో వారికి ఓట్లు వేసి గెలిపిస్తామని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను దీక్షా శిబిరంలో యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ప్రభుత్వం నిన్నటి రోజుల ప్రకటించిన మెగా డిఎస్సీ దగా డిఎస్సీ అని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు డిఎస్సీ కోసం నిరీక్షిస్తున్న సమయంలో ఉత్తుత్తి పోస్టులతో ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయడం అన్యాయ మన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మునిరత్నం, ప్రసన్నకుమార్, రెడ్డప్పనాయుడు, సివిప్రకాష్, కృష్ణమూర్తి, ఏకాంబరం, సరిత, ఈశ్వర్, మహేంద్ర, పార్థసారథి, శశికుమార్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమస్యలు పరిష్కరించాలని వినతి

సదుం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



మండల పరిధిలోని దళితవాడల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు గురువారం సదుం తహశీల్దారు చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలోని దళితవాడల్లో ఎస్‌సీఎస్‌టీ గ్రామాల పరిదిలో స్మశానవాటికలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లేపల్లె శ్రీనివాసులు, తాటిగుంటపాలెం పంచాయతీ ఉపసర్పంచి, సంఘ అధ్యక్షులు రామచంద్రయ్య, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

## డప్పు కళాకారులను ఆదుకున్నది వైకాపా ప్రభుత్వమే

సదుం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



రాష్ట్రంలోని డప్పు కళాకారులను ఆదుకుంటున్నది, ఆదు కున్నది వైకాపా ప్రభుత్వమేనని ఎంపీపీ ఎల్లప్ప అన్నారు. గురువారం సదుం మండల పరిషత్ కార్యాలయంలో డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో డప్పు కళాకారులకు కనీసం గుర్తింపు కార్డులు కూడా ఉండేవి కావన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక ఎస్సీ ఎస్టీలకు బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతోందన్నారు. ఇప్పటికే పుంగనూరు నియోజకవర్గంలో చాలా మందికి డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులతో పాటు పింఛన్లు అందుతున్నాయన్నారు. అందుకే వచ్చే ఎన్నికలలోకూడా జగనన్ననే గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ వరప్రసాద్, మండల వైకాపా కన్వీనరు రెడ్డెప్పరెడ్డి, వైకాపా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సీతాపతి, మల్లేపల్లె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## తెదేపాలో చేరిన వైకాపా నాయకులు

రొంపిచెర్ల, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



మండల పరిధిలోని పెద్దిగొట్టిగల్లు పంచాయతీ వైకాపా నాయకులు గోపీనాధరెడ్డి, సుధాకర్, జయరాంరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీను, యర్రయ్యలు గురువారం వైకాపా ను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పుంగనూరు తెదేపా ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగాచల్లాబాబు మాట్లాడు తూపుంగనూరు నియోజక వర్గంలో తెలుగుదేశం జెండాను ఎగురవేయాలని కోరారు. అదేవిధంగా పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు.

## వైకాపా ఎస్సీసెల్ మండల కన్వీనర్‌గా గోవిందయ్య

చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



వైకాపా ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా వరదన గోవిందయ్య నియమితు లయ్యారు. గురువారం ఈమేరకు ఆయన వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలందు కొన్నారు. చారాల పంచాయతీ మాజీ సర్పంచుగా గోవిందయ్యసేవలందించారు. వైకాపా బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేసారు. గుర్తించిన అధిష్టానం ఆయన ను ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా నియమించింది. రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని గోవిందయ్య అన్నారు. జిల్లా అధ్యక్షుడు వెంకట స్వామి, ప్రధాన కార్యదర్శి చెన్నరాయుడు, భాస్కర్, శంకరప్ప, డిష్‌సూరి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నేడు శివయ్య ఆలయానికి భూమిపూజ

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



కోట మండలం తిమ్మానాయుడుపాలెంలో వెలసిన పురాతన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీసంత కాళహస్తి స్వామివారి ఆలయ నూతన పునర్నిర్మాణం కోసం శుక్ర వారం ఉదయం9.15 నుంచి 10.30 గంటల లోపుభూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనులను తిమ్మానాయుడుపాలెం గ్రామ స్తులు, పరిసర ప్రాంతాల ప్రజల సహాయ సహకారాలతో ప్రారంభించనున్నారు. ఆలయ చరిత్రతిమ్మానాయుడుపాలెంలో శ్రీభ్రమరాంబ సమేత శ్రీకాళహస్తి స్వామివారి ఆలయం 16 శతాబ్ధంలో నిర్మించినట్లుశాసనాలు చెబుతున్నాయి. ఆతర్వాత ఈ ఆలయం లో ధూపదీప నైవేద్యాలను మల్లపు శివయ్యశెట్టి సుమారు 60 సంవత్సరాల పాటు పర్యవేక్షించారు. అనంతరం2005నుంచిమల్లాపురమేష్‌కుమార్‌ధర్మకర్తగావ్యవహరిస్తున్నారు. ఆలయబాగోగులు, దైనంది నపూజాకార్యక్రమాలు చూస్తున్నారు.

## నియామకం



కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

తిరుపతి జిల్లా వైసీపీ మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా కోట మండలం తిన్నెలపూడికి చెందిన సుధారెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆ మేరకు ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత ఎన్నికల్లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వందకు వందశాతం నెరవేర్చారని గుర్తు చేశారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

– టీడీపీ మండల కన్వీనర్ కిషోర్‌నాయుడు



చిట్టమూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందు తుందని చిట్టమూరు మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు అన్నారు. బాబుషూరిటీ భవిష్యత్తుకుగ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల నాయకులతో కలిసి ఆయననార్త్‌వరత్తూరులో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబుతో రాష్ట్రప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కిషోర్‌నాయుడు వెంట నడిచి ఇంటింటికి తెలుగుదేశం కరపత్రాలు అందజేశారు.

## భార్య హత్య కేసులో భర్త అరెస్ట్

ఓజిలి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



మహిళ హత్య కేసులో నిందితుడు శివకుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓజిలి మండలం వీర్లగునపాడులోని అటవీ ప్రాంతంలో ఇటీవల మహిళను హత్య చేసిన నిందితుడు శివకుమార్‌నుఅరెస్టు చేసినట్లు నాయుడుపేట డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. వీర్లగునపాడులో వల్లూరు దొరసానమ్మ (35)ను కత్తితో అతి కిరాతకంగా భర్త శివకుమార్ హత్య చేశాడని, ఈ కేసులో అతన్ని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట సీఐ జగన్‌మోహన్‌రావు, ఎస్ఐ తిరుమలరావు, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నాయుడుపేట డిఎస్పీ బదిలీ

నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త

నాయుడుపేట డిఎస్పీగా పనిచేస్తున్న రాజగోపాల్‌రెడ్డి గురువారం చిత్తూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న వి.శ్రీనివాసరెడ్డిని నాయుడుపేట డిఎస్పిగా నియమించినట్లు తెలుస్తుంది. డిఎస్పి రాజగోపాల్‌రెడ్డి గూడూరు, నాయుడుపేట డివిజన్‌లో పనిచేశారు. నాయుడుపేట పట్టణంలో ట్రాఫిక్, ప్రమాదాలు, చోరీలు నియంత్రణ చర్యలు చేపట్టారు.

## ప్రసాద్ మృతి తీరని లోటు



మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త

స్థానిక 22వ వార్డులో పారిశ్రామికవేత్త వల్లభనేని ప్రసాద్ మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి అతని భౌతికకాయానికి మాజీ శాసన సభ్యులు నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కురుగొండ్ల రామకృష్ణ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులనుపరామర్శించి ఓదా ర్చారు. తిరుపతి పార్లమెంట్‌కార్యనిర్వాహక కార్యదర్శి పులు కొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంట్‌వాణిజ్యప్రధానకార్యదర్శిపునుగోటి విశ్వనాథం, సైదాపురం నాయకులుకాపాశ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్‌నాయకులు శివకుమార్, హేమంత్, సుకుమార్ తదితరులు ఉన్నారు.

## రైతు ఉద్యానవన పంటలపై దృషి సారించాలి

కెవికె అధిపతి డాక్టర్ బిజి రాజు



బాలాయపల్లి, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త

రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారించాలని వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ బిజి రాజు తెలిపారు. వెంకటగిరి కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరంవారుగ్రామీణ ఉద్యానఅవగాహన, అనుభవ కార్యక్రమంలో భాగంగా, ఉద్యాన విద్యార్థులతో రైతు సదస్సు ను బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన కళాశాల, అనంతరాజుపేట అసోసియేట్ డీన్ డా.కె. గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు నమూనాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని కెవికె ఉద్యాన శాస్త్రవేత్త డా.తిరుపాల్‌నిర్వహించారు. ఈ సదస్సులో ఉద్యాన కళాశాల, అనంతరాజుపేట ప్రొఫెసర్ డా. రామయ్య, సహాయ అధ్యాపకుడు డా. విరేష్, కెవికె శాస్త్రవేత్తలుడా.బి.విజయశ్రీ, డా.పి.నాగార్జునరెడ్డి, ఐ.రాజీవ్, బాలాయపల్లి ఉద్యాన అధికారి ఆనందరెడ్డిలు, పల్లిపడు, మన్నూరు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌కి పలువురు నివాళులు

వాకాడు, జనవరి 1, ప్రభాతవార్త

ప్రముఖ కాంట్రాక్టర్, కల్లూరు సర్పంచ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు దు వ్వూరు విజయ భాస్కర్ రెడ్డి సోదరి (మాజీ సర్పంచ్ వాకాటి బాలిరెడ్డి సతీమణి) వాకాటి సుబ్బలక్ష్మమ్మకు గురువారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. గురువారం కల్లూరులో సుబ్బలక్ష్మమ్మ ఉత్తరక్రియలు నిర్వహించారు. పరామ ర్శించిన ప్రముఖులలో ఎమ్మెల్సీ మేరిగమురళీధర్, వైకాపా రాష్ట్ర కార్యదర్శి పేర్నేటి శ్యాంప్రసాద్ రెడ్డి, వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్ రెడ్డి, వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు దామోదర్‌రెడ్డి, ఏఎంసిమాజీ ఛైర్మన్ పాపారెడ్డి మనో జ్‌కుమార్‌రెడ్డి, వాకాడు మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు దువ్వూరు అజిత్ కుమార్, వాకాడు ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏఎంసిడైరెక్టర్ వాకాటిజనార్ధన్‌రెడ్డి, పలువురు గూడూరు వైకాపా నాయకులు, బంధువులు శ్రేయోభిలాషి స్నేహితులు, ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచ్లు, వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డీవిసత్రం ఎంపిడీవోగా సింగరాజ్

దొరవారిసత్రం, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



దొరవారిసత్రం మండల పరిషత్ అధికారిగా ఓ సింగ రాజ్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. చిత్తూ రు జిల్లా యాదమరి మండలం ఎంపిడీవోగా పనిచే స్తూ బదిలిపై డీవిసత్రంకు వచ్చారు. స్వీకరించిన ఎం పిడీవో పలు రికార్డులను పరిశీలించారు. మండల ఉపాధ్యక్షులనుసన్మానించినఎంపిడీవోదొరవారిసత్రంమండల ఉపాధ్యక్షులను ఎంపిడీవో సింగ రాజ్, ఎవో రఘురామయ్య మైలాంగంలోని వారి ఇంటి వద్ద సెల్వాలతో మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డిని సన్మానించారు.

## డిస్కం ఇఇకి పదోన్నతి

గూడూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



గూడూరు డివిజన్‌లో సుధీర్ఘకాలంగా డిస్కం ఇఇగా ఇస్మాయిల్ అహ్మద్ పనిచేస్తూ ఎపి ఎస్పిడిసిఎల్ ఎస్ఈగా పదోన్నతి పొందడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా ఎపిఈఈ యూనియన్ ఆధ్వర్యంలో ఇఇ ఇస్మాయిల్ అహ్మద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డివిజనల్ అధ్యక్షుడు శ్రీధర్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారిస్తూ, మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ సెక్రటరీ

## బాబు షూరిటీ - భవిష్యత్‌కి గ్యారెంటీ ఇంటింటికి ప్రచార కార్యక్రమం

గూడూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



గూడూరు పట్టణం 2వ వార్డు బణిగిసాహెబ్ పేట ఏరియాలో మాజీ కౌన్సిలర్ నూర్జహన్, అలీ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అధికారంలోకి ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మాజీ శాసన సభ్యులు, నియోజకవర్గ ఇంచార్జి పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యా రాణి వివరించారు. ఈ కార్యక్రమంలో మండపేట అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, నాయకులు శీలం కిరణ్ కుమార్, రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, దాసరి శైలజ, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

## జనసేనతోనే రాష్ట్ర అభివృద్ధి

ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర

గూడూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. పట్టణంలోని నర్సయ్యగుంట, సనత్ నగర్ ప్రాంతాలలో గురువారం జనంలోకి జనసేన భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో నిత్యవసర సరుకులతో పాటు విద్యుత్, బస్ చార్జిలు విపరీతంగా పెంచారని దీంతో సామాన్యులు బతకలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు పెద్దిశెట్టి ఇంద్రవర్ధన్, నాయకులు ఉప్పు సాయి కిరణ్, శివ కుమార్, సనత్, వెంకటేశ్వర్లు, హర్ష పెంచలయ్య, వసంత్, రహమాన్, సబ్బు, ఓంకార్, షారు, క్రాంతి, సుమంత్, నాని, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నుంచే ఓటేయొచ్చు

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా 80 ఏళ్ల పైబడిన 40 శాతానికి మించి వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే అవకాశం కల్పించనున్నారు. ఆమేరకు అధికారులు ఆదిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ఎన్నికల ప్రకటన వెలువడిన అనంతరం అధికారులు సూచించిన తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలి. పోలింగు ఒకటి రెండు రోజుల ముందు రిటర్నింగ్ అధికారి నేతృత్వంలో పోలింగ్ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి బ్యాలెట్ పత్రం అందజేస్తారు. ఓటు వేసిన తర్వాత సీల్డ్ కవర్‌లో పెట్టి అక్కడే బ్యాలెట్ పెట్టెలో వేసే అవకాశం కల్పిస్తారు. రాజకీయ పార్టీల తరుపున పోలింగ్ ఏజెంట్లు కూడా వారి వెంట ఉంటారు.

## టిడిపి నేతలచే తెదేపా క్యాలెండర్ల ఆవిష్కరణ

శాంతిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



మండలంలోని అబకలదొడ్డిలో తెదేపా నేతలు పార్టీ క్యాలెండర్లను ఆవిష్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూకృషిచేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, నారాయణ, బద్రి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

## కంప్యూటర్..టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

శాంతిపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

స్థానిక శ్రీ వినాయక ప్రైవేట్ ఐటిఐ కాలేజ్‌లో ఇంటర్, ఐటిఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన ఎస్సీ విద్యార్థులకు కంప్యూటర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హేమ తెలిపారు. అర్హత కలిగిన వారు ఈనెల 10వతేది లోగా9032024424నెంబరును సంప్రదించాలని కోరారు.

## సత్యవేడు టీడీపీ అభ్యర్థి హెలెనే..!!

నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దు

**సత్యవేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి హెలెనే అంటూ ప్రకటించారు. పార్టీ పరిశీలకులు కూడా దశలవారిగా మండలాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి నాయకులను, కార్యకర్తలను హెలెన్‌ను గెలిపించుకోవాలని ఆ పార్టీ నాయకులను చంద్రబాబు హెచ్చరించడం జరిగింది. కానీ రోజుకో నాయకుడు నాకే టికెట్ నాకే టికెట్ అంటూనియోజకవర్గంలో జోరుగా అసత్య ప్రచారాలు చేస్తున్నారు. డా. హెలెన్ మాత్రం పార్టీ ముందుకు తీసుకుపోతూకార్యకర్తలకు బరోసాగా ఉంటున్నారు. ఏది ఏమైనప్పటికి అధికార పక్షం ఎంత మంది అభ్యర్థులను మార్చినా హెలెన్ మాత్రం కార్యక్రమాల్లో తగ్గేదేలేదంటూ పార్టీ ముందుకు పోవడం కొసమెరుపుగా సాగుతుంది.

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చీఫ్ ఎలక్టోరల్ అధికారులను కలిసిన కలెక్టర్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త
తిరుపతి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మి షా గురువారం విజయవాడలో పలువురు ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కేఎస్ జవహర్ రెడ్డిని, ఆంధ్రప్రదేశ్ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనాని, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్‌ని మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాకు సంబంధించిన పలు అంశాలు వివరించి చర్చించారు. ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నతాధికారులను కలసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ లక్ష్మి షా


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త






## ఇందిరానగర్‌లో దొంగలు చోరీ

### నగదు, వెండి వస్తువులు అపహరణ



గూడూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త
గూడూరు రెండవ పట్టణ పరిధిలోని 25వ వార్డులో ఉన్న ఇందిరా నగర్‌లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. వాలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న దీపిక ఇంటికి తాళాలు వేసి సమీపంలో ఉన్న తల్లి ఇంటికి వెళ్ళింది. తన భర్త లేని రోజుల్లో ఆమె తల్లి వద్దనే ఉంటుంది. ఇది గుర్తించిన దొంగలు రాత్రి తాళాలు పగుల గొట్టి ఇంట్లోకి జొరబడ్డారు. ఇంట్లో దాచిన లక్షా 54 వేల రూపాయిల నగదులో పాటు కొన్ని వెండి వస్తువులను అపహరించి ఉడాయించారు. పక్కనే ఇంట్లో కూడా చోరికి యత్నించారు. కానీ వస్తువులు పోలేదని తెలిసింది. యధావిధిగా గురువారం ఇంటికి వెళ్లిన వాలంటీర్ దీపిక చోరీ గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.



జడ్పీ స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

## మంచినీటి సమస్య తలెత్తకుండా

# పక్కా చర్యలు

### జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:
వేసవి సమీపిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య ఉత్పన్నం కాకుండా పక్కా చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. జడ్పీ సమావేశభవనంలో గురువారం జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అధ్యక్షతన 2, 4 స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని, పెద్ద ఎత్తున భవనాలను నిర్మించడంతో పాటు ఉద్యోగుల నియామకం చేపట్టి పూర్తి చేసిందన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంను ఇంటి వద్దకే తీసుకెళ్ళి అందించడానికి వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసిందని, జిల్లాలో అతివేగంగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సాగుతుందన్నారు. కరవును పారద్రోలడానికి ఉపాధి హామీ పనులు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారని, రోజు 50 వేల లీటర్ల పాల సేకరణకు యంత్రాంగం పని చేస్తోందన్నారు. వేసవిను దృష్టిలో వుంచుకొని ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు మంచినీటి పైపులైన్లతో ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను జడ్పీ చైర్మన్ ఆదేశించారు. అలాగే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో సంక్షేమ హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు తెచ్చుకొనే విధంగా వారిని పరీక్షలకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు విద్య, వైద్య రంగాలను సరిగా వినియోగించుకొని ఆదర్శ, ఆరోగ్య సమాజ ఆవిష్కరణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ స్థాయి సంఘ సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత**

వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, నీటి వృధాతో పాటు కలుపు నివారణ కోసం డ్రిప్ విధానం చేపట్టడం జరిగిందని, రబీ సీజన్‌లో పంట విస్తీర్ణం బాగా పెరిగిందని జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు అన్నారు. జడ్పీ చైర్మన్ అధ్యక్షతన గురువారం 3వ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యవసాయ రంగం కోసం ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, జిల్లాలో ప్రధానంగా విత్తనాల పంపిణీ, పురుగుల మందులు, రసాయనికి ఎరువులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నారన్నారు. అలాగే త్వరలో క్రిమిసంహారక మందులు నానో ఎరువులు సైతం సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అలాగే పట్టుపరిశ్రమ శాఖ ద్వారా పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా లబ్ది పొందాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మత్స్య సంపాదన పెంపొందించడానికి పలు పథకాలు అమలులోకి వచ్చాయని, ఈ పథకాలు ఉపయోగించుకొని మత్స్య సంపద ద్వారా ఆదాయం పెంపొందించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి, వ్యవసాయ, పట్టు పరిశ్రమల శాఖ, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వేతన జీవులకు కేంద్ర బడ్జెట్‌లో బిగ్ రిలీఫ్

### ఉద్యోగులకు రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు




తిరుపతి,ఫిబ్రవరి 1ప్రభాతవార్త:
నెలవారీగా వేతనం పొందుతున్న ఉద్యోగులకు కేంద్ర బడ్జెట్‌లో బిగ్ రిలీఫ్ కల్పించారు. 7లక్షల రూపాయల ఆదాయం వరకు పన్ను రాయితీ కల్పిస్తూ గురువారం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో వేతనజీవులకు ఊరటకలిగించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టారు. పాత ఆదాయపు పన్ను విధానం క్రింద స్టాండర్డ్ డిడక్షన్ క్రింద 50వేల రూపాయల వరకు మినహాయింపు ఉండేది. దాన్ని 25వేల రూపాయలకు పొడిగించారు. 2.50లక్షలు నుండి 3.25లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఉంటుంది. కార్పొరేట్ సంస్థల ఆదాయంలో పన్ను చెల్లింపు 30శాతం నుండి 22 శాతానికి తగ్గిస్తున్నట్లు కేంద్రమంత్రి తెలిపారు. ప్రత్యక్ష పరోక్ష పన్నులు చెల్లింపు యధాతథంగా అమలుచేస్తారు. కొత్త ఆదాయపు పన్నుస్లాబ్‌లలో 3-6లక్షల రూపాయల మధ్య ఆదాయంపై 5శాతం పన్ను విధించబడుతుంది. 6-9లక్షల రూపాయల మధ్య ఆదాయంపై 10శాతం పన్ను, 12-15లక్షల రూపాయలు ఆదాయం మధ్య 20శాతం పన్ను విధించనున్నారు. అన్నివర్గాల వ్యక్తులకు, సీనియర్ సిటిజన్లు, సూపర్‌సీనియర్ సిటిజన్లుకు కొత్తపన్ను విధానంలో ఒకే విధంగా ఉంటాయి.

## తిరుపతి జిల్లా నూతన ఎస్‌పిగా మల్లికా గార్గ్

### పరమేశ్వరరెడ్డి ప్రకాశంజిల్లాకు బదిలీ



తిరుపతి,ఫిబ్రవరి 1ప్రభాతవార్త:
తిరుపతి జిల్లా నూతన ఎస్‌పిగా మల్లికాగార్గ్ నియమితులయ్యారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ఎస్‌పిగా పనిచేస్తున్న ఆమె డైరెక్ట్ ఐపిఎస్ అధికారిణి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి బదిలీ అనివార్యమైంది. 2021లో ఎంపి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లు ప్రభావంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే ప్రతిపక్షాల ఆరోపణలతో తిరుపతి ఎస్‌పిగా ఉన్న పరమేశ్వరరెడ్డిని ఎట్టకేలకు ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. ఈ స్థానంలో ప్రకాశం జిల్లా ఎస్‌పిగా ఉన్న మల్లికాగార్గ్‌ను నియమించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి పరస్పర బదిలీల పోస్టింగ్ ఉత్తర్వులిచ్చారు. కాగా ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లాకు వస్తున్న రెండవ మహిళా ఎస్‌పిగా మల్లికాగార్గ్ పారదర్శకంగా తన విధి నిర్వహణ నిర్వర్తించనున్నారు. ఇప్పటికే ప్రకాశం జిల్లాలో ఆమె ఎస్‌పిగా ప్రజలకు చేరువగా ఉంటూ ఏ సమస్య వచ్చినా నేరుగా ప్రజలు ఎస్‌పిని ఏ సమయంలో అయినా కలిసే అవకాశం కల్పించారు. అంతేగాక ఏదేని సమస్యలు, ప్రజలకు శాంతి భద్రతల పరిరక్షణలో, నేరాల నియంత్రణలో, ట్రాఫిక్ సమస్య పరిష్కారం వంటి అంశాల్లో స్థానిక పోలీసుఅధికారులు పరిష్కారంచేయలేని పక్షంలో ఎస్‌పిగా గార్గ్ నేరుగా వెళ్ళిన సందర్భాలు లేకపోలేదనేది పోలీసుశాఖలో చర్చనీయాంశం. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు తిరుపతి ఎస్‌పిగా మహిళ ఐపిఎస్ అధికారిణి రావడంతో మరీ పోలీసుల పనితీరు ఎలా ఉండనుందనేది చూడాల్సిందే. కాగా తిరుపతిలో పనిచేసే అవకాశం రావడం నిజంగా తన అదృష్టంగా ఆమె భావిస్తున్నారు.

## సకాలంలో అందని జీతాలు పనుల వత్తిడితో..

## ఎంపిఇఓ ఆత్మహత్యాయత్నం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీలక్ష్మీ

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మండలం ఇనగలూరులో పని చేస్తున్న ఎంపిఇఓ సకాలంలో జీతాలందక, అరకొర జీతాలతో సంసారాన్ని నడుపు కోలేక, పనుల వత్తిడి భరించలేక గురువారం గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన సంచలనం కల్గించింది. ఇనగలూరు ఆర్‌బికెలో పని చేస్తున్న శ్రీలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడటం దారుణం అని పలువురు వాపోతున్నారు. నెలంతా పని చేసిన ఇచ్చే అర కొరా రూ.12వేలు కూడా సకాలంలో ఇవ్వక పోగా రక రకాల పనుల్లో వత్తిడి వేధింపులతో విసిగి పోయానని బాధితురాలు వివరించారు. ఇనగలూరు ఆర్‌బికెలో మల్టి పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా సుమారు 8 సంవత్సరాల నుంచి పని చేస్తున్నట్లు తెలిపారు. వీరికి నెలకు కేవలం రూ.12వేలు జీతాలు ఇస్తున్నారు. అయితే ఆ జీతాలు కూడా అందకపోవటంతో, జీతాలు పెరగకపోవటం, సమాన పనికి సమాన హక్కు అనేది ఇక్కడ లేదని దారుణ పరిస్థితి ఎదుర్కొంటున్నట్లు బాధితురాలు వాపోతున్నారు. ఓ వైపు విధుల్లో అవాంతరాలు, మరో వైపు కుటుంబంలో మానసిక వత్తిడులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. రాష్ట్రంలో 1611 మంది ఎంపిఇఓలు దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో సార్లు అప్పట్లో వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, కాకాని గోవర్ధన్ రెడ్డివిన్నవించినా పట్టించుకోలేదు. చివరకు ముఖ్యమంత్రికి కలసినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఓ ఉద్యోగి ఇలా వ్యవహారించటం గమనిస్తే వ్యవసాయశాఖలో ఉద్యోగుల పరిస్థితి ఎలా ఉందో అర్థమౌతుంది. ప్రభుత్వం మల్టి పర్పస్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరుతున్నారు. ఊరు కాని ఊరిలో వచ్చి పని చేస్తుంటే సకాలంలో జీతాలు అందకపోతే ఎలా బతకాలని, కుటుంబాన్ని ఎలా నిర్వహించాలని వాపోతున్నారు.

## చిరుత దాడిలో వ్యక్తికి గాయాలు



సదుం,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త
తోటకు కాపలాగా ఉన్న వ్యక్తిపై చిరుత దాడి చేసి గాయపరచిన సంఘటన పులిచెర్ల మండలం మంగళంపేట వద్ద జరిగింది. బాధితుడి కథనం మేరకు మంగళంపేట వద్ద ఉన్న మామిడితోటలో నంజంపటేకు చెందిన రవి అనే వ్యక్తి కుటుంబంతో సహా కొన్నిసంవత్సరాలుగా కాపురం ఉన్నాడు. తోటకు కాపలాగా ఉంటు అక్కడే ఆవులుమేపుకోవడం వంటి పనులుచేసుకునేవాడు. ఈక్రమంలో గురువారం తెల్లవారుజామున పశువుల వద్ద శబ్దం వస్తుండటంతో రవి అక్కడికి వెళ్లి పరిశీలిస్తుండగా ఉన్నట్లుండి ఒక్కసారిగా అతనిపైచిరుత దాడి చేసింది. అతను గట్టిగా అరవడంతో కుటుంబసభ్యులు పరుగున వచ్చారు. వెంటనే చిరుత అక్కడ నుంచి జారుకుంది. గాయపడిన అతన్ని కుటుంబసభ్యులు సదుంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి హుటాహుటిన వైద్యశాలకు వచ్చి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించమని వైద్యశాల సూపరింటెండెంట్ పుష్పకుమారిని కోరారు. బాధితుడిని వైద్యశాల చైర్మెన్ కృష్ణారెడ్డి పరామర్శించారు. అదేవిధంగా జిల్లా ఎస్సీ సెల్ వైకాపా అధ్యక్షుడు వెంకటస్వామి, పలువురు గ్రామస్థులు వచ్చి పరామర్శించారు.

## 'కరుణ' హామీతో దీక్షకు ముగింపు



తిరుపతి,ఫిబ్రవరి 1ప్రభాతవార్త:
న్యాయమైన సమస్యల సాధనకోసం టిటిడి అటవీవిభాగం కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన 38నెలల నిర్విరామ నిరవధిక దీక్షకు ఎట్టకేలకు ముగింపు పలికింది. టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి కార్మికులపై "కరుణ"చూపడంతో కార్మికులు దీక్ష ముగించారు. దీక్షలో ఉన్న నిరసనకారులకు నిమ్మరసం ఇచ్చి గురువారం రాత్రి దీక్ష విరమింపజేశారు. టిటిడి అటవీకార్మికులకు కార్పొరేషన్ నుండి మినహాయింపు ఇస్తామని, టైమ్‌స్కేల్ వర్తింపజేసి వేతనాలు పెంచుతామన్నారు. ఇప్పటికే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కందారపు మురళి నిరవధిక దీక్ష చేపట్టిన విషయం విదితమే. 29న మురళిని అరెస్టుచేసినా, మరొక బృందం దీక్షలను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి నిరసన కారులను కలసి హామీ ఇవ్వడంతో ముగించారు.

## ద్విచక్రవాహనం, ట్రాక్టర్ ఢీ

## ఇద్దరు మృతి

### ఒకరి పరిస్థితి విషమం

ఏర్పేడు,ఫిబ్రవరి 1, ప్రభాతవార్త;
మండలంలోని వికృతమాల డిక్షన్ కంపెని, నుంచి రేణిగుంట మార్గంగా వెళుతున్న ఇద్దరు యువ కార్మికులు రోహిత్, అభి అనే20సంవత్సరాల లోపు వయసు ఉన్న టీసీఎల్ కంపెనీ కార్మికులు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా, రాహుల్ అనే యువకుడి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు పేర్కొన్నారు.

## సిఎం జగన్ రామకుప్పం పర్యటన వాయిదా

కుప్పం,ఫి బ్రవరి 1 ప్రభాతవార్త
సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రామకుప్పం మండల పర్యటన వాయిదా పడింది. తొలుత ఈనెల 5వతేది సిఎం రామకుప్పంలో పర్యటించి కృష్ణా జలాలు ప్రారంభిస్తారని ఆ పార్టీ నేతలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతప్రచారం చేశారు. కాగా గురువారం జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్ తదితరులు రామకుప్పం మండలంలో పర్యటించారు. హంద్రీ-నీవా కాలువలు, బహిరంగ సభ నిర్వహణకు గురుకుల పాఠశాల మైదానం పరిశీలించారు. కాగా హంద్రీ- నీవా జలాలు పూర్తి స్థాయిలో వచ్చేందుకు ఇంకా కొంత సమయం పట్టనుండడంతో పాటు సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు సైతం జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడింది. కాగా అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం కృష్ణాజలాలు పూర్తి స్థాయిలో కుప్పం వైపు ప్రవహించే సమయంలోనే ముఖ్యమంత్రి పర్యటనను ఖరారు చేయనున్నట్లు తెలిసింది.



స్థలాలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## హంద్రీ-నీవా జలాల ఘనత చంద్రబాబుదే

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



కుప్పం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త
కుప్పం ప్రాంత ప్రజలు, రైతులకోసం హంద్రీ-నీవా జలాలు తెచ్చిన ఘనత మాజీ సిఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో సిఎంగా ఉన్న చంద్రబాబునాయుడు 468కోట్ల నిధులు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు మంజూరు చేశారన్నారు. 123కి.మీ.ల దూరం మేర కాలువల నిర్మాణంతో పాటు 110చెరువులకు నీరు, 6300 ఎకరాల ఆయకట్టు కోసం ఒక టిఎంసి జలాల కృష్ణా జలాలు అందించాలనే లక్ష్యంతో పనులు మొదలయ్యాయన్నారు. తెదేపా పాలనలో 96.17శాతం పనులు పూర్తయ్యాయన్నారు. అయితే అప్పట్లోనే రైతుల ద్వారా పనులను వైకాపా నేతలు అడ్డుకున్నారన్నారు. రెండేళ్ల పనులు పూర్తి కాకుండా చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. మిగతా పదిశాతం పనులను నాలుగున్నర ఏళ్లుగా చేస్తున్నా పూర్తి కాలేదన్నారు. ఇప్పుడు మోటార్లు ఆన్‌చేసి కుప్పానికి నీళ్ల ఇచ్చేస్తున్నామంటూ చంకలు గుద్దుకోవడం తగదన్నారు. సమావేశంలో నేతలు రాజ్‌కుమార్, సత్యేంద్రశేఖర్, శాంతారా ం, కాణిపాకం వెంకటేష్, మణి, మురళి, జాకీర్, జెకె సంతోష్, వెంకటేష్, బాలాజీ, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రా కబడ్డీ ఫైనల్ పోటీలో

# ఉద్రిక్తత

### ఫైనల్ పోటీలు నిర్వహించకుండానే నగరి జట్టు గెలిచినట్లు ప్రకటించడానికి యత్నం



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:
చిత్తూరు మెసానికల్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కబడ్డీ ఫైనల్ పోటీల్లో ఉద్రిక్తత చోటు చేసుకొంది. ఫైనల్ పోటీల్లో నగరి, పాలసముద్రం బాలుర కబడ్డీ జట్లు పోటీ పడాల్సి వుండగా మ్యాచ్ నిర్వహించకుండానే నగరి కబడ్డీ జట్టును విన్నర్‌గా ప్రకటించడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తత చోటు చేసుకొంది. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఇప్పటికే సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి పోటీలు పూర్తి కావడంతో చిత్తూరు మెసానికల్ గ్రౌండ్స్‌లో జిల్లా స్థాయి ఫైనల్ పోటీలు జరుగుతున్నాయి. జిల్లాలోని 14 నియోజకవర్గాల పరిధిలోని 14 కబడ్డీ జట్లు ఫైనల్‌కు చేరాయి. ఈ క్రమంలో కుప్పం కబడ్డీ జట్టులో నకిలీ కబడ్డీ ఆటగాళ్ళు వున్నారని అనుమానం రావడంతో మిగిలిన జట్ల సభ్యులు ఫైనల్ పోటీలకు హాజరు కావడానికి వచ్చే సమయంలో ఆటగాళ్ళ ఆధార్ కార్డులు తీసుకురావాలని స్పష్టం చేశారు. దీంతో కుప్పం కబడ్డీ జట్టు సభ్యులు ఫైనల్ పోటీలకు హాజరు కాలేదు. జిల్లా స్థాయిలో కుప్పం, నగరి, పాలసముద్రం కబడ్డీ జట్లు ఫైనల్ పోటీలకు అర్హత సాధించగా వీరిలో ఒకరు విన్నర్స్, మరొకరు రన్నర్స్, చివరి జట్టు మూడవ స్థానంలో నిలవాల్సి వుంటుంది. కుప్పం జట్టు ఫైనల్ కబడ్డీ క్రీడకు గైర్హాజరు కాకపోవడంతో నగరి, పాలసముద్రం కబడ్డీ జట్లు ఫైనల్ పోటీల్లో ఆడాల్సి వుంటుంది. అయితే నిర్వాహకులు ఎలాంటి పోటీ పెట్టకుండానే నగరి కబడ్డీ జట్టును జిల్లా స్థాయి విజేతగా ప్రకటించడానికి ప్రయత్నించారు. దీంతో పాలసముద్రం కబడ్డీ జట్టు సభ్యులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో పరిస్థితిని చక్కదిద్దడానికి పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఇప్పటికీ ఆడుదాం ఆంధ్రా కబడ్డీ ఫైనల్ పోటీలు నిర్వహించని పరిస్థితి నెలకొంది.

# చౌడేపల్లి ఆసుపత్రికి జబ్బుచేసింది...!

## సమయపాలన పాటించని వైద్యులు -ఇబ్బందుల్లో రోగులు

చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త
" ఇంటి పేరు కస్తూరి లోపల చూస్తే గబ్బిలాల కంపు " అన్న చందంగా తయారైంది స్థానిక ప్రభుత్వాసుపత్రి తీరు. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుంటే కిందిస్థాయి అధికారులు లక్ష్యాలను నీరుగార్చుతున్నారన్న విమర్శలున్నాయి. స్థానిక సర్కారు దవాఖానాలో వైద్యులు సమయపాలన పాటించలేదనీ, నెలలో 10మార్లు డుమ్మా కొడుతున్నారని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో యుడిసి, పిహెచ్‌ఎన్, ఫార్మసిస్టు, కాంపోడర్ మినహా ఎవరూ లేకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శమిచ్చాయి. నిత్యం రోగులతో రద్దీగా వుండే 24 గంటలూ సేవలందించాల్సిన ఆసుపత్రిలో వైద్యులు లేకపోవడం సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరోగ్య కేంద్రంలో రూ. 50లక్షల విలువ చేయు రోగనిర్ధారణా పరికరాలున్నప్పటికీ వాటి వినియోగం లేకపోవడం గమనార్హం. ల్యాబ్ అసిస్టెంట్ ఆరోగ్య కేంద్రానికి ఎప్పుడు వస్తాడో తెలియని పరిస్థితిలో వున్నామని రోగులంటున్నారు. బయట పరీక్షలు చేయించుకోవాలంటే ధరలు తడిసి మోపెడవుతున్నాయని వారు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ దవాఖానాన్ని గాడిలో పెట్టాలను రోగులు కోరుతున్నారు.





ఖాళీగా దర్శనమిస్తున్న డాక్టర్ కుర్చీ, ఆరోగ్యకేంద్రం

**ట్రైనింగ్ డ్యూటీపై వెళ్ళా**

ఈ విషయమై వైద్యాధికారి పవన్‌కుమార్‌ను వివరణ కోరగా తాను ట్రైనింగ్ డ్యూటీపై చిత్తూరుకు వెళ్ళాననీ, అత్యవసర సమయాల్లో రాత్రిళ్ళు సైతం ఆసుపత్రిలోనే వుంటున్నానని సమాధానమిచ్చారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా**

ప్రభుత్వ ఆరోగ్యకేంద్రంలో వైద్యుల డుమ్మా విషయం తెలిసిందనీ, ఉన్నతాధికారులకు నివేదిస్తానని హెచ్‌డిఎస్ ఛేర్మన్ కె.కళ్యాణ్‌భరత్ తెలిపారు.

## గడప గడపకు ఆత్మీయ పలకరింపు

-వేదాంతపురంలో చెవిరెడ్డి లక్ష్మీ ఇంటింటి ప్రచారం



**తిరుపతిరూరల్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో మీకు, మీ కుటుంబానికి లబ్ధి చేకూరుతేనే...వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైకాపాకు ఓటు వేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ వేదాంతపురం గ్రామస్తులను కోరారు. గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని గురువారం వేదాంతపురం గ్రామ పంచాయతీలో నిర్వహించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీలలో 99శాతం నేరవేర్చడంతో పాటు ప్రజా విశ్వాసాన్ని చూరగొనిందని తెలిపారు. ఇంటింటికి వెళ్ళిన చెవిరెడ్డి లక్ష్మీకి మహిళలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వేదాంతపురం గ్రామ సర్పంచ్ చెరకుల జనార్ధన్ యాదవ్, ఎంపిటిసి చెఱకుల కృష్ణవేణి, మాజీ సర్పంచ్ చిరంజీవి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, వైకాపా నాయకులు చొక్కారెడ్డి జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులపై బహిరంగ సభ



**విజయపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** విజయపురం ఎంపిడిఓ ఆఫీసు ఆవరణలో గురువారం ఉపాధి హామీ పనులపై బహిరంగ సభ నిర్వహిం చారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై గత డిసెంబరు 28 నుంచి జనవరి 10 వరకూ గ్రామాల్లో తనిఖీ నిర్వహించారు. ఈ పథకంలో గత సంవత్సరం రూ. 8,26,87,853 కోట్లు ఖర్చు చేశారు. వీటిలో వేతనాలకు రూ. 6,92,07,908 కోట్లు, సామగ్రికి రూ. 1,34,79,345 కోట్లు వ్యయమైంది. క్షేత్ర సహాయకుల నుంచి రూ. 2690 వేలురికవరీచేయగా, రూ.3600 అపరాధంవిధించారు. డ్వామా పిడి గంగాభవానీ, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎపిడి శోబన్‌బాబు, ఎంపిడిఓ చంద్రమౌళి, ఎఇఇ వీరభద్రం, ఎపిఓబబిత, ఉపాధి సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

## శ్రీహరిపురంలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

**విజయపురం, జనవరి 31 ప్రభాతవార్త :** మండలంలోని శ్రీహరిపరంలో బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు కోరు తున్నారు. గ్రామం నుంచి బయట ప్రాంతాలకు వెళ్లే వారు ఎండలోనూ, వర్షం లోనూ ఇబ్బంది పడుతున్నారని వాపోతున్నారు. గ్రామంల గ్రామ సభ ఏర్పాటు లో, రాజకీయ నాయకులు సమావేశాల్లో ఈ అంశం చర్చించినప్పటికీ ఫలితం కనిపించలేదని ఆవేదన చెందారు. అలాగే శ్రీహరిపురం ఎఎడబ్ల్యు వార్డు సభ్యుడు తిరుపాల్ శ్రీహరిపురం బస్ స్టాప్ వద్ద షెల్టర్ నిర్మించాలని డిమాండ్ చేశారు.

## తిరుచానూరు నూతన సిఐగా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**తిరుచానూరు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త** తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా శ్రీకాంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన కడప జిల్లా ఓబులాపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బాధ్యతలు చేపడుతూ తిరుచానూరు సిఐగా పదోన్నతి పొందారు. ఆయనను తిరుచానూరు ఎస్ఐలు చిరంజీవి, వెంకట సుబ్బయ్య, జగనాథ్ రెడ్డి, స్వాగతించారు. అంతకు ముందు సిఐ విధులు నిర్వహించిన సుబ్రమణ్యం రెడ్డి తిరుపతి స్పెషల్ బ్రాంచ్ సిఐగా బదిలి అయ్యారు.

## బిసిలకు వెన్ను దన్ను టిడిపినే

అధికార దుర్వినియోగానికి రిటర్న్ గిఫ్ట్ తప్పదు
జయహో బిసిలో టిడిపి ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని



**చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** తెలుగు దేశం పార్టీ వ్యవపస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు పార్టీ ఆవిర్భావం నుండి బిసిలకు వెన్ను దన్నుగా నిలిచారన్నారు. స్థానిక ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో గురు వారం జయహో బిసి కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 5 ఏళ్ళలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై అధికార దుర్వినియోగానికి పాల్పడి అక్రమ కేసులతో వేధించిన పోలీసులకు, అధికారులతకు, వైసిపికి రిటర్న్ గిఫ్ట్ తప్పక ఇస్తామని అన్నారు. ప్రభుత్వం అమరరాజ కంపెనీపై కత్తిగట్టి హైదరాబాద్‌కు వెళ్ళిపోయేవిధంగా చేసిందని దుయ్యబట్టారు. నాడు టిడిపి ప్రభుత్వ హయాంలో, నేడు వైసిపి హయాంలోనూ ఎంఎల్ఏ తమ్ముడు చెవిరెడ్డి రఘునాథ రెడ్డి యధేచ్ఛగా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు కొట్టుకుపోయిన బ్రిడ్జిల గురించి ఎంఎల్ఏ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. చెవిరెడ్డి అందించే కానుకలు ప్రతి ఒక్కరూ తీసుకోవాలనీ, ఓటు మాత్రం సైకిల్ గుర్తుకే వేయాలన్నారు. అంతకుముందు టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సి.ఆర్.రాజన్ మాట్లాడుతూ చంద్రగిరి ఎంఎల్ఏ అభ్యర్థిత్వంపై ఎటువంటి అనుమానాలు, అపోహాలు వద్దని కార్యకర్తలకు స్పష్టం చేశారు. అనంతరం పులివర్తి నాని, సి.ఆర్.రాజన్‌లకుఘనసన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధిలో చెవిరెడ్డికి సాటిలేరు

వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి



**చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిలో ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మరొకరు సాటిలేరని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి అన్నారు. చిన్నరామాపురం పంచాయతీలో గురు వారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనను గజమాలతో సన్మానించి, పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గడపగడకు వెళ్ళి ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలు, చెల్లించిన నగదు మొత్తాన్ని వివరించారు. మా తండ్రి ఆశయ సాధనకై మా అన్నయ్య తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికలలో ఎంఎల్ఏగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మీ ఆశీర్వాదంతోఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి గడపను అభివృద్ధి చేస్తాం..!

టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకువస్తే నియోజకవర్గంలోని ప్రతి గడపను అభివృద్ధి చేస్తామని టిడిపి యువజన నాయకుడు పులివర్తి వినీల్ అన్నారు. గురువారం పుల్లమ నాయుడు కండ్రిగ పంచాయతీలో మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎర్రచందనం, మట్టి మాఫియాను ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలలో నా తండ్రి పులివర్తి నానిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు చినబాబు, తానికొండ మురళీ మోహన్ నాయుడు, రెడ్డెప్ప నాయుడు, గోపాల్ నాఇయుడు, మునిరత్నం నాయుడు, సురేంద్ర నాయుడు, విజయ్ కుమార్ బోయడు, చెంగల్రాయలు బోయడు, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి తోటలపై రైతులకు అవగాహన అవసరం

ఉద్యానవన శాఖ అధికారి దశరధరామిరెడ్డి



**రామచంద్రాపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** రైతులకు మామిడి తోటల యాజమాన్య పద్ధతులపై అవగాహన అవసరమని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ధశరధరామిరెడ్డి అన్నారు. గురువారం నడవలూరులో ఆయన మామిడి తోటలను పరిశీలించారు. ఆయన రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నేపధ్యంలో పలువురు రైతులు మామిడి పూతలు సక్రమంగా రాకపోవడంపై ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాతావరణంలో మార్పుల కారణంగా పూతలు ఆలస్యంగా వచ్చే అవకాశం వుందనీ, ఫిబ్రవరి రెండవ వారం వరకు పూతలు వచ్చే అవకాశం మెండుగా వుందన్నారు. రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానవన శాఖ అధికారి సునీల్, రైతులు పాల్గొన్నారు.

**ఎస్‌పిఎంవివి టెక్ ఫెస్ట్ పోస్టర్లను విడుదల చేసిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి**

**తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త** ఎస్‌పిఎంవివి టెక్ పెస్ట పోస్టర్లను వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్. రజని, ఎస్ఓఈటి డైరెక్టర్ ప్రొఫెసర్ పి. మల్లికార్జున తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చ్ 5,6వ తేది సిఎస్‌సి సెలిస్టా 24, మార్చి 12వ తేది నుంచి 13వ తేది వరకు ఈసిఈ సదర్వ 2కె 24, మార్చి 14వ తేది 15వ తేది వరకు ఈఈఈ విద్యుత్సవ్ 2కె24, మార్చి 14వ తేది 15వ తేది మెక్ - మెక్ అరెనా 2కె 24 టెక్ ఫెస్ట్ నిర్వహస్తున్నట్లు తెలిపారు. యువతి యువకుల సృజనాత్మక మనస్సుల యొక్క వినూత్న ఆలోచనలను అన్వేషించడం జరుగుతుందన్నారు. వివిధ ఈవెంట్లలో పేపర్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్పో, టెక్ ఐడియాజ్, టెక్నికల్ క్విజ్ మొదలైంది. వివిధ సాంకేతిక సంస్థలకు చెందిన విద్యార్థులు ఈవెంట్లలో పాల్గొంటారన్నారు.

## నిధులు విదల్చని పదవులివ్వడమే గుర్తింపా!

-జయహో బిసి సభలో సుధీర్‌రెడ్డి



**.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం పైసా నిధులు విదల చ్చని, ఎవ్వరికి ఉపయోగపడని కార్పొరేషన్ పదవులు కట్టబెట్టి ఇదే బిసి అభివృద్ధి అంటూ ప్రకటించుకోవడం దారుణమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి విమర్శించారు. గురువారం తొట్టంబేడు గ్రామంలో జయహో బిసి కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, డాక్టర్ దశరధాచారి, మండల బిసి అధ్యక్షుడు సురేంద్రయాదవ్, రాష్ట్ర బిసి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు రేణుకాదేవి, డాక్టర్ ఉమేష్‌రావు, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు మిన్నల్‌రవి, రాష్ట్ర సాంస్కృతికశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి)లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభకు అశేష సంఖ్యలో జనం హాజరయ్యారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిల కార్పొరేషన్ ఏర్పాటుచేసినా ఎందుకు ఉపయోగం లేకుండా పోయిందని, పేరుకే కార్పొరేషన్‌లు ఉన్నాయని ఛైర్మన్‌లు కూడా ఉత్సవ విగ్రహాలుగా మారారని ధ్వజమెత్తారు. నిధులు, విధులు లేని కార్పొరేషన్‌లు ఎందుకంటూ మండిపడ్డారు. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో వైకాపా అరాచకాలకు బలైపోయిన దివంగత తెదేపా నేతల కుటుంబసభ్యులను స్మరించుకుంటూ వారికి ఆత్మశాంతి కలగాలని మౌనం పాటించారు. బిసిలను అక్కున చేర్చుకుని ఆదరించింది స్వర్గీయ ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబునాయుడే అన్నారు. తాను ఎంఎల్ఏగా గెలిస్తే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 56శాతం రిజర్వేషన్లు ఇస్తామన్నారు. తొట్టంబేడు గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నామని అధికారంలోకి వస్తే పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బొజ్జలసుధీర్‌రెడ్డిని నాయకులు భారీపూలమాలతో సత్కరించడంతోపాటు బిసిల ఐక్యతను చాటారు. కార్యక్రమంలో గాండ్లసాధికార కమిటీ సభ్యులు కన్నావరం హరిబాబు, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ కెవి.ప్రతాప్, తిరుపతి పార్లమెంటు పాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, అధికార ప్రతినిధి చెంచయ్యానాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరాజనాయుడు, బిసి విభాగం తిరుపతి పార్లమెంటు కార్యదర్శులు యంయస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు దొరైరాజ్, ప్రధాన కార్యదర్శి మునిరాజయాదవ్, శ్రీకాళహస్తి టౌన్ బిసి సెల్ అధ్యక్షులు పోలూరుశ్రీనివాసులురెడ్డి బీమాల వెంకటేశ్వర్లు, బీమాల భాస్కర్‌ముదిరాజ్, చిల్లకూరు బాలసుబ్రమణ్యం, సుధాకర్, మణి తదితరులు పాల్గొన్నారు.

## బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థికసాయం



**.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** మండలంలోని కాసరం హరిజనవాడలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న జనసేన ఇన్‌ఛార్జి కోటవినుత కాసరం పంచాయతీలోని హరిజనవాడలో నివారంఉంటున్నప్రభాకర్‌కుమారుడు భాను ప్రకాష్(3) బ్లడ్ క్యాన్సర్‌తో భాదపడుతున్నాడని వేలూరులోని సిఎంసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలుసుకున్న వినుత కోట రూ.20వేలు ఆర్థికసాయం అందించడంతో పాటు సిఎంసి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి డిశ్చార్జి చేసి చెన్నైలోని ఎగ్మోర్ ఆస్పత్రిలో చికిత్సకి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోటచంద్రబాబు, మండల ఇన్‌ఛార్జి పేటచంద్రశేఖర్‌తో పాటు పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైకాపాదే

-సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణి



**.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత ఒక్క వైకాపా ప్రభుత్వానిదే అని ప్రత్యర్థుల గుండెల్లో రీసౌండ్ రావాలని అందుకు వైకాపా శ్రేణులు సమాయత్తం కావాలని ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణి పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని పొయ్య పంచాయతీలోని పొయ్యకొత్తూరు, రామానాయుడు ఎస్టీ కాలనీ, పొయ్య హరిజనవాడ, పొయ్య గ్రామాల్లోని ప్రతి గడపలో జగనన్న పథకాల ద్వారా లబ్ధి పొందిన వారితో మమేకమవుతూ తాము గెలిచినపుడు నుంచి అనునిత్యం ప్రజాసేవలో తరిస్తూ కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు అండగా నిలచిన ఒకే ఒక వ్యక్తి తన భర్త బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఒక్కరే అని అది అందరికీ తెలుసన్నారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రానున్న నేపధ్యంలో నాలుగేళ్ళుగా కనిపించకుండా పోయిన వారందరు నేడు అందరిపై అబద్ధపు ప్రేమను చూపిస్తూ మోసం చేయాలని చూస్తున్నారని వారిని నమ్మితే నట్టేట ముంచుతారని తెలిపారు. ముందుగా బియ్యపుశ్రీవాణికి తొట్టంబేడు మండల అధ్యక్షుడు, సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంపిపి ఉన్నంనిర్మలమ్మ మరియు వైకాపా నాయకులు కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మునిరత్నం, పార్టీ కన్వీనర్ శంకరయ్య, జెసిఎస్ కన్వీనర్ భక్తవత్సలం, పిఎసిఎస్ ఛైర్మన్ పోతుగుంటమణిబాబునాయుడు, కోవిచంద్రయ్యానాయుడు, డిల్లీబాబు, భాస్కర్, గరటారెడ్డి, శ్రీరాములురెడ్డి, గిరిరెడ్డి, మోహన్, మణి, నరసింహులు, నెలవల ప్రసాద్, గంధంశ్రీను, రాజేంద్ర, ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వీరాస్వామి, సుబ్బానాయుడు, వెంకి, సుబ్బయ్య, అల్లెయ్య, రమణారెడ్డి, రంగయ్య, చంద్రబాబు, గోపినాయుడు, సుబ్రమణ్యంనాయుడు, రమణయ్యానాయుడు, సుబ్రమణ్య యాదవ్, నరసింహనాయుడు, వెంగళరావు, దీపక్ మరియు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అపరిష్కృత మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలపై ధర్నా



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** అపరిష్కృత మున్సిపల్ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏపిటిఎఫ్ మున్సిపల్ ఉపాధ్యాయ సమస్యలపై తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా అధ్యక్షుడు బి.మురళీకృష్ణ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు సరీర్వసులు రూపొందించి పదోన్నతులు బదిలీలు నిర్వహించాలని మున్సిప్ ఉపాధ్యాయులకు సర్వీసులు రూపొందించి పదోన్నతులు బదిలీలు నిర్వహించాలని మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్‌ఖాతాలు ప్రారంభించి రుణ సౌకర్యాలు కల్పించాలని అర్బన్ మండల విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు పోస్టులు మంజూరు చేయాలని సర్వీసు కమిషన్ పరీక్షలకు హాజరయ్యే మున్సిపల్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు మాదిరి వయోపరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ అన్ని రకాల బకాయిలు మొత్తం బకాయిలు మొత్తం విడుదల చేయాలని ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపిఎస్ విధానాన్ని అమలుచేయాలని విద్యారంగానికి గొడ్డలిపెట్టైనా 117 జివోలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షుడు బి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఎంతో పోరాటంతో రద్దు చేయించుకున్న అప్రెంటిస్ విధానాన్ని పునరుద్ధరించాలని చూస్తున్న ఈ ప్రభుత్వ నిరంకుశత్వాని నిదర్శనమని రాబోవు ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. రాష్ట్ర కౌన్సిలర్ వెంకటాద్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 50వేల పైచిలుకు ఉపాధ్యాయ ఖాళీలు ఉంటే కేవలం 6వేల పోస్టులకు డిఎస్సీ నిర్వహిస్తామన్నటువంటి ప్రభుత్వం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో జిల్లా సబ్‌కమిటీ సభ్యులు షేక్ నౌజియా, ఎం.దాము, గోపాల్. బి.హేమకుమార్, సుబ్రమణ్యారాజు, మల్లికార్జున, శ్రీనివాసులు, అక్తర్‌ఆలీఖాన్, గిరిప్రసాద్, మునస్వామి, చెంచురాజు, వెంకటేశ్వరరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, పూర్వరాష్ట్రఆడిట్‌కమిటీ కన్వీనర్ జి.సుధాకర్ మహిళా ఉపాధ్యాయులు విరివిగా పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా నంది సర్కిల్



**.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** పట్టణంలోని బసవయ్యాపాళెం రోడ్డు కూడలి వద్ద ఏర్పాటు చేసిన నంది సర్కిల్ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. నాలుగురోడ్లు కలిసే సర్కిల్ కావడంతో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లులేకపోవడం దీనికి తోడు నంది సర్కిల్ కట్టడం ఎత్తుగా ఉండడంతో పాటు ఈసర్కిల్ ముందు ఫ్లెక్సీ బ్యానర్లు ఏర్పాటు చేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుం డా పోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. సర్కిల్ ఏర్పాటు చేయడం మంచిదే అయినా ఎత్తుగా ఏర్పాటు చేయడం ప్రమాదాలకు నిలయంగా మారు తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నందిసర్కిల్ ఎత్తు తగ్గించి తిరిగి పునఃనిర్మాణం చేపట్టి ప్రమాదాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనాఉంది. ఈదిశగా ఆలయాధికారులు చర్యలు తీసుకోవాలి.

## తొట్టంబేడు ఎంపిడిఓ బదిలీ

**.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** తొట్టంబేడు ఎంపిడిఓ కె.సురేష్‌బాబు నెల్లూరు జిల్లా పెళ్ళకూరు మండల ఎంపిడిఓగా బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీలు ఊపందుకున్నాయి. దీంతో తొట్టంబేడు ఎంపిడిఓగా సమర్ధవంతంగా పనిచేసిన సురేష్‌బాబును బదిలీచేశారు. ఈనేపధ్యంలో గురువారం ఆయన పెళ్ళకూరు మండలంలో బాధ్యతలు స్వీకరించారు. కాగా తహశీల్దార్‌లు జిల్లాల వారీగా బదిలీ అయ్యారు. అయితే ఏమండలాలు కేటాయిస్తారో తెలియాల్సి ఉంది.

# తిరుపతి డివిజన్

## ఈ స్థలం ఎవరిది!



**రేణిగుంట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం కరకంబాడి గుట్టపై భూ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. కరకంబాడి గుట్టపై సుమారు 2 వేల మంది గుడారాలు వేసుకున్నారు. ఇల్లు నిర్మించుకోవడానికి గుడారాలు వేశామని వారు అంటున్నారు. నిరుపేదలమైన మేము ప్రభుత్వ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే తప్పా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇది ప్రభుత్వ స్థలం అంటూ అధికారులు, తన సొంత స్థలం అంటూ ఓ ప్రైవేటు వ్యక్తి అంటున్నారని తెలిపారు. ఈ విషయమై సదరు వ్యక్తి రవి గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఆ స్థలం తనకు చెందిందిగా చెప్పారు. అందుకు సంబంధించి రికార్డులు తన వద్ద ఉన్నాయని తెలిపారు. స్థల విషయమై కోర్టులో కేసు నడుస్తున్నదన్నారు. అంతేకాకుండా ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉన్నట్లు తెలిపారు. కొంత మంది స్థానికులతో కలసి ఇతర జిల్లాలకు చెందిన వారు తన స్థలంలో గుడారాలు వేశారన్నారు. రాత్రి సమయాల్లో వారి వల్ల భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. ఈ మేరకు కొంత మంది స్థానికులతో కలసి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయిస్తామని పేర్కొన్నారు.

## సిమెంటు రోడ్డు పనులు పరిశీలించిన కమిషనర్



**నగరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి కాకవేడు సచివాలయం రాజీవ్ నగర్‌లో సిమెంటు రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు సిమెంటు రోడ్డు కావాలంటూ మంత్రి రోజాకు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన ఆమె గడపగడపకు నిధుల ద్వారా సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో నివేదికలు సిద్ధం చేసిన అధికారులు రూ.3.5 లక్షల నిధులతో సిమెంటు రోడ్డు పనులకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ నరేష్, స్థానిక నాయకులు మునివేలు, చిన్నదొరై తదితరులు పాల్గొన్నారు.

## శ్మశానం వద్ద నూతన ఆర్చి నిర్మించాలి



**నగరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** శ్మశానంలో రూ.1.75 కోట్ల నిధులతో చేపట్టే ఆధునీకరణ పనుల్లో ముఖ ద్వారం వద్ద ఉన్న ఆర్చిని కూడా నూతనంగా నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. శ్మశానం వద్ద ఉన్న ఆర్చి శిథిలమై పగుళ్లు వదిలి ఉందని కూలిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. కూలి ఎవరిమీదైనా పడితే ప్రాణాపాయం సంభవించే ఆస్కారం ఉందని మంత్రి రోజా చొరవ తీసుకునా శిథిలమైన ఆర్చిని తొలగించి నూతన ఆర్చిని నిర్మించాలని కోరుతున్నారు.

## ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు తప్పని తంటాలు



**నగరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** ఇండియన్ గ్యాస్ వినియోగదారులకు తంటాలు తప్పడం లేదు. రెండు వారాలకు ఒక సారి గ్యాస్ సిలిండరు లోడు వస్తుండడంతో అవసరాలకు వినియోగదారులకు సిలిండర్లు అందడం లేదు. ఎప్పుడు లోడు వస్తుందో అంటూ ఏజెన్సీ వారిని సంప్రదిస్తూ పడిగాపులు కాయాల్సి వస్తోంది. గురువారం లోడు రావడంతో వినియోగదారులు ఏజెన్సీ కార్యాలయం వద్ద బారులు తీరారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన వారు క్యూలో గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

## 2వ స్థానంలో నిలిచిన కేకేసీ ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు



**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:** డా. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వాలీబాల్ విభాగంలో ఇంటర్ అంతర్ కళాశాల స్పోర్ట్స్, కల్చరల్స్ పోటీల్లో స్థానిక కేకేసీ ఫిజియోథెరపీ కళాశాల విద్యార్థులు 2వ స్థానంలో నిలిచారు. వీరిని కళాశాల ఛైర్మన్ కె.కుప్పయ్యశెట్టి, వైస్ ఛైర్మన్ నరసింహన్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి తదనంతరం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సభలో ఛైర్మన్ కుప్పయ్యశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, క్రీడల్లో తప్పని సరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాలేజీ ప్రాంగణంలో క్రీడల పోటీలు నిర్వహించడానికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల పీఈటీ సుభాణిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ నరసింహన్, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డా. మహేష్, కళాశాల పీఈటీ సుభాణి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ



**నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ బిసికాలనీకి చెందిన సురేంద్రకుమార్(43) బుధవారం మృతి చెందారు. అలాగే నారాయణవనం బజారువీధికి చెందిన ఆర్కాటు పళణిశెట్టి(78) గురువారం ఉదయం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. పళణిశెట్టి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబానికి అండగా వుంటామని హామి ఇచ్చారు.

## కశింమిట్టలో రాములవారి గుడి నిర్మాణానికి భూమిపూజ



**నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** మండలంలోని కశింమిట్ట దళితవాడలోని పురాతన రాములవారి ఆలయం నిర్మాణానికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సిఫార్సు మేరకు టిటిడి అధికారులు సుమారు 8లక్షల రూపాయాలను మంజూరు చేయడం జరిగింది. ఈ గుడి నిర్మాణానికి నిధులు విడుదల జరగడంతో గురువారం ఉదయం సర్పంచ్ అయ్యప్పశశికళ చేతుల మీదుగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వి సుబ్రమణ్యం, రోశయ్య, వాలంటర్ రాకేష్, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం



**నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని శ్రీ ఛైతన్య ఎజిఎం సురేష్, ప్రిన్సిపాల్స్ కె గోపి, శరవణలు తెలిపారు. గత నెలలో విద్యార్థులకు నిర్వహించిన క్రీడలకు సంబంధించి ప్రతిభను కనపరిచిన వారికి మెడల్స్, సర్టిఫికేట్లను పరమేశ్వరమంగళంలోని బ్రాంచ్-2లో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల పట్ల మక్కువ కల్పించాలన్నారు. జోనల్ పిఇటి నాగేంద్ర, పిఇటిలు సతీష్, మహదేవన్, నాగరాజన్, డీన్ శ్రీహరివర్మ, సి బ్యాచ్ ఇంచార్జి వినోద్, ఇంచార్జిలు సౌమ్య, నగేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే భూమనను కలసిన

నగరపాలకసంస్థ ఉపకమిషనర్ అమరయ్య

**తిరుపతి, ఫిబ్రవరి 1ప్రభాతవార్త:** తిరుపతి నగరపాలకసంస్థ ఉపకమిషనర్ అమరయ్య గురు వారం ఉదయం ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డిని కలిశారు. పద్మావతిపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు,

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సాయం

**నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి సంబంధించి పూర్వ విద్యార్థి ఉమాదేవి కుమారుడు సాఫ్ట్‌వేర్, వీరభద్రలు కలిసి సుమారు 50 వేల రూపాయాలను హెడ్‌మాస్టర్ మనోహరికి అందజేశారు. పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదులకు సంబందించి పూర్వ విద్యార్థులుగా తమవంతు సాయంగా అందించామన్నారు.

# తిలాపాపం..తలా పిడికెడు

**-యధేచ్ఛగా గంగకాలువ మట్టి తరలింపులు**
**-నిద్రావస్థలో అధికారులు**
**-సత్యవేడు వాసులకు పొంచి ఉన్న ప్రమాదం**


గంగ కాలువ మట్టిని త్రవ్వేస్తున్న దృశ్యం

సత్యవేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా సత్యవేడు మేజర్ పంచాయతీలో తెలుగు గంగ కాలువ మట్టి తరలింపులు యధేచ్ఛగా సాగుతున్నాయి. రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా జేసిబీల సాయంతో టిప్పర్ల ద్వారా గ్రావేల్‌మట్టిని తరలిస్తూ లక్షలాది రూపాయలను జేబుల్లో వేసుకుంటున్నారు. ఇక్కడ తెలుగు గంగా కాలువ ఏర్పాటు సమయంలో కాలువ గట్టు నీటి ఒరవడికి గురికాకుండా ఉంచిన గ్రావేల్ మట్టి మట్టిమాఫి యాకు కాసులవర్షం కురిపిస్తోంది. తిలా పాపం..తలా పిడికెడు అన్నట్లుగా పోలీసులు, రెవిన్యూ శాఖ, తెలుగు గంగ అధికారులు అక్రమ మట్టి రవాణాను ప్రోత్సహిస్తూ అక్రమార్కుల నుండి నెలా నెలా మామూళ్ళుకు అలవాటు పడ్డారని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈక్రమంలో వందల సంఖ్యలో లారీలు సరిహద్దులు దాటి మట్టిని తరలిస్తున్నా సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు నిద్రావస్థలో ఉన్నట్లు తెలుస్తుంది. ఈ టిప్పర్ లారీల పుణ్యమా అని రోడ్లపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. దుమ్ము ధూళి, ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది ఇలాగే కొనసాగితే తెలుగు గంగ కాలువ గట్టు పటిష్టను కోల్పోయి ముంపునకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. గంగ కాలువను ఆనుకుని సత్యవేడు పంచాయితీలోని కోటమిట్ట, ఉలవచేను వాసులు నివాస గృహాలను ఏర్పాటు చేసుకుని ఉన్నారు. మట్టి అక్రమ తరలింపులు కారణంగా ఇక్కడ నివాసం ఉన్న సత్యవేడు వాసులుకు ఏనాటికైనా ప్రమాదం పొంచి ఉందనే చెప్పవచ్చు. అక్రమ కార్యకలాపాలకు సత్యవేడు అడ్డాగా మారినా, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోంటునూ అధికారులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. ఇకనైనా జిల్లా ఉన్నతాధి కారులు చొరవచూపి సత్యవేడు గంగకాలువ మట్టి అక్రమ తరలింపులకు అడ్డుకట్ట వేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

# రుయాలో జరుగుతున్న ఆరోపణలపై...సమగ్ర విచారణ చేపట్టాలి

**ఏఐటియుసి, సిపిఐ పార్టీల డిమాండ్**


నిరసన తెలుపుతున్న ఏఐటియుసి, సిపిఐ నాయకులు, కార్మికులు

తిరుపతి టౌన్, ఫిబ్రవరి 1 ప్రభాత వార్త : రుయా ఆసుపత్రిలో ఏవన్ కాంట్రాక్టర్ల ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయని సమస్యలపై అడిగితే దాడులకు పూనుకుంటున్నారని తిరుపతి రుయా ఆసుపత్రి పరిపాలన భవనం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నగర కార్యదర్శి జె. విశ్వ నాథం, ఏఐటియుసి నగర ప్రధాన కార్యదర్శి ఎన్డి రవిలు మాట్లాడుతూ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్ర పై ఏవన్ కాంట్రాక్టర్లు కొంత మంది వర్కర్లను రెచ్చగొట్టి తప్పుడు ప్రచారాలు చేయిస్తున్నారని హాస్పిటల్‌లో శాంతి భద్రతను విఘాతం కలిగిస్తున్నారని ఇలాంటి ఘటనలు మరలా మరాల పునరావృతం కాకుండా చూడవల్సిన బాధ్యత సూపరింటెండెంట్ పై ఉందని వారు అన్నారు. 225 మంది కార్మికులు పనిచేయవల్సిన చోట రుయా హాస్పిటల్‌కు కార్మికులను సరఫరా చేయాల్సి వుండగా 90 మంది కార్మికులను పెట్టుకుని పనిచేయిస్తూ కార్మిక దోపిడి చేస్తూ ఆర్థిక దోపిడికి పాల్పడుతూ ఈఎస్ఐ, పిఎఫ్ డబ్బులు కార్మికుల జీతాలలో పట్టుకుని వారి అకౌంట్‌లో జమ చేయకుండా ఆర్థిక దోపిడికి పాల్పడుతున్న ఏవన్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్‌కి వినతి పత్రం ఇవ్వడంతో ఇలాంటి నీచ రాజకీయాలకు పూనుకోవడం సరైనది కాదని దీనిపై సమగ్ర విచారణ చేపట్టి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం సూపరింటెండెంట్‌కి వినతి పత్రం ఇచ్చి చర్చించారు. సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందించి ముగ్గురు డాక్టర్లతో విచారణ కమిటిని ఏర్పాటు చేస్తామని మూడు రోజులలోపు నిజానిజాలపై నిగ్గు తేలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నగర అధ్యక్షులు కేవై రాజా, జిల్లా ఆఫీస్ బేరర్‌స సిహెచ్ శివకుమార్ ఎన్ శివ ఉదయ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ నగర నాయకులు ఎల్‌కె నాయుడు, రైల్వే బాల అల్లాబకస్, మహేంద్ర మీనా ఏపి బాలు శ్రీనివాసులు, పెద్ద ఎత్తున సెక్యూరిటీ గార్డ్స్, ఏఐటియుసి నగర నాయకులు పాల్గొన్నారు.

# జాతీయ ఖో-ఖో జట్టుకు దివ్య



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 1ప్రభాతవార్త: జాతీయ స్థాయి ఖో-ఖో జట్టు పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున దివ్య ఎంపికైంది. టేకుమంద జడ్పీ ఉన్నత పాఠశాల నందు 9వ తరగతి చదువుతున్న దివ్య ఎంపిక కావడం పట్ల హెడ్మాస్టర్ సుభాన్, పిడి దేవేంద్ర, ఉపాధ్యాయులు, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ అమరనాథన్, సర్పంచ్ రత్నయ్యలు అభినందించారు. గత ఏడాది నవంబర్‌లో 67వ జాతీయ ఖో-ఖో పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టులో దివ్య పాల్గొంది. ఆ జట్టులో విశేష ఆట ప్రతిభను కనబరచిన దివ్య జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు డిఎస్‌డిఓ బాలాజీ తెలిపారు. జనవరి 31వ తేదీ నుండి ఫిబ్రవరి 4వ తేదీ వరకు జార్ఖండ్ రాజధాని రాంచీలో జాతీయ ఖో-ఖో పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున దివ్య ఆడనుంది.

# కర్ణాటక మాజీ ఆర్థిక శాఖ మంత్రికి ఘన స్వాగతం



ఏర్పేడు, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త: మండలం లోని ఎండీ పుత్తూరులో కర్ణాటక మాజీ ఆర్థిక శాఖమంత్రి గాలి కరుణాకర్‌రెడ్డి గురువారం తన తాతలనాటి స్వగ్రామమైన ఏర్పేడు మండలం లోని ఎండీ పుత్తూరులో గురువారం ఆయనకు సర్పంచి కందాటి మోహనప్రియా ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆయన చిన్ననాటి స్నేహితులు ఘనస్వాగతం పలికారు. ఆయన ముందుగా గ్రామంలోని తమ కులదైవం ఐన మునీశ్వర స్వామి ఆలయంలో పూజల నిర్వహించి ఆలయ పూజారివద్ద స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. తరువాత గ్రామదేవత యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారనియ దర్శించుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు ఆయనను ఘనంగా సత్కరించి మండలంలో వారిసేవలను గురించి వివరించారు ఈకార్యక్రమంలోఎంపీటీసీ పద్మమ్మ, కేశవుల యాదవ్, సంజీవరెడ్డి,, సుబ్రమణ్యం యాదవ్ తదితురులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తి విద్యార్థి దశలోనే వెల్లువిరియాలి

**భారత మహిళా క్రీడాకారిణి ఈ. రజని**




తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : విద్యార్థి దశనుంచే క్రీడాస్ఫూర్తి వెల్లువిరియాలని ప్రముఖ భారత మహిళా క్రీడాకారిణి ఈ. రజని అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపాలనే భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో నిర్వహించిన స్ఫూర్తి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తూ విద్యార్థులు చదవుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇస్తే రెండింటిలో రాణించగలరని సూచించారు. క్రీడల వలన జీవితంలో టీమ్ స్పిరిట్, ఎనర్జీ, హార్డ్ వర్క్ లక్షణాలు పెంపొందించుకోవచ్చునని, క్రీడలు ఆత్మగౌరవాన్ని శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయని, క్రీడలు శారీరక వ్యాయామం, శరీరం, మనస్సు యొక్క సమన్వయం, మానసిక చురుకుదనాన్ని కలిగి ఉంటాయి. కళాశాలల నుండి ముఖ్యముగా గ్రామీణ ప్రాంతాల నుంచి కష్టించి అనేక మంది క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో పేరు గడించాలని, ప్రస్తుత క్రీడాకారులు ఆ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ఉన్నత స్థానాలకు చేరాలనే వారికి మన జిల్లాకు చెందిన రజని జీవిత కథనే స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు. అనంతరం రజని, వారు మాతృమూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిసికల్ డైరెక్టర్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ముస్తాక్ అహ్మద్, జానకిరామిరెడ్డి, ఎస్వీ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు



తిరుపతి మహిళావర్సిటీ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత రెండు రోజులుగా తిరుపతి తారకరామా స్టేడియం నందు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు గురువారంతో ముగిసాయి. నియోజకవర్గం నుంచి వచ్చిన బాలుర, బాలికల జట్టు పోటాపోటీగా పాల్గొన్నాయి. క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, అతిధులుగా తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఎలమంచిలి ప్రవీణ్ విచ్చేసి గెలుపొందిన టీంలకు బహుమతి ప్రదానం చేసారు. ఈ సందర్భంగా సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎప్పుడు జగన్మోహన్ రెడ్డి వినూత్న కార్యక్రమాలను చేపడు తారని దానిలో భాగంగా ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ క్రీడాకారులకు కూడా ప్రతిభ చాటే అవకాశం దొరికింది అన్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వార్డు స్థాయి నుండి మండల స్థాయి నుండి, నియోజకవర్గ స్థాయి నుండి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం ద్వారా అనేక మంది క్రీడాకారులు వారి ప్రతిభను చాటుకోవడానికి ఒక వేదిక దొరికిందన్నారు. జిల్లా క్రీడా అధికారి సయ్యద్ సాహెబ్ మాట్లాడుతూ గెలుపొందిన జట్లు విశాఖపట్నం నందు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అక్కడ గెలుపొందిన వారికి మొదటి స్థానంగా ఐదు లక్షల రూపాయల ప్రైజ్ మనీ, రెండవ స్థానానికి రెండు లక్షలు ప్రైస్ మనీ, మూడవ స్థానానికి లక్ష రూపాయిలు ప్రైజ మనీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బహుమతి ప్రదానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డైనమోస్ ఫుట్‌బాల్ క్లబ్ సీనియర్ మెంబర్ రమణ, ఎన్ఐఎస్ కోచ్‌లు జి. మాలిని, హిందూజా, గోపి, ప్రేమ్, వినోద్, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రమణ్యస్వామి ఆశీస్సులందరిపై కలగాలి -బిజెపి నేత



తిరుపతి, ఫిబ్రవరి 1ప్రభాతవార్త: తిరుత్తణిలో వెలసిన వళ్ళీదేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు బిజెపి నేత గుండాల గోపీనాథరెడ్డి తెలిపారు. బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథరెడ్డి కుటుంబంతోకలసి గురువారం తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. మూడవసారి మోడీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు.

# 6న జిడినెల్లూరుకు చంద్రబాబు

**- కదలిరా.. తెలుగుదేశం పిలుస్తోంది విజయవంతంకు నాయకులతో డాక్టర్ థామస్ సమీక్ష**



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలను సన్నద్ధం చేయడానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఈ నెల 6వ తేదీన గంగాధరనెల్లూరు మండలం రామాపురం గ్రామంలో తెలుగుదేశం పిలుస్తోంది... రా కదలిరా బహిరంగ సభ నిర్వహించనున్నారు. చంద్రబాబు నాయుడు జిడినెల్లూరు జిడినెల్లూరు బహిరంగ సభ ఖరారు కావడంతో సభ విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను చేపట్టడానికి మాజీ మంత్రి అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, జిల్లా పార్టీ అధ్యక్షుడు పులివర్తినాని ఆధ్వర్యంలో జిడినెల్లూరు నియోజకవర్గ దేశం ఇన్‌చార్జి డాక్టర్ థామస్, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, నియోజకవర్గ పరిశీలకులు రవిప్రకాష్, నిమ్మల కృష్ణప్ప, పూతలపట్టు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ మురళీమోహన్, చిత్తూరు నియోజకవర్గ తెలుగుదేశం ఆశావాహులు చంద్రప్రకాష్, కుప్పం నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ, పిఎస్ మునిరత్నం, పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా, ఇతర దేశం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిడినెల్లూరు నియోజకవర్గ దేశం ఇన్‌ఛార్జీ డాక్టర్ థామస్ జిడినెల్లూరులో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సభను విజయ వంతం చేయడానికి చేయాల్సిన జన సమీకరణపై అప్పుడు దృష్టి సారించారు. నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లోని మండల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి చంద్రబాబునాయుడు బహిరంగ సభకు పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# తెలుగుదేశం పార్టీకి దళితులు వెన్నెముక : పోతుగుంట విజయ్‌బాబు



పుత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీకి దళితులే వెన్నెముక లాంటివారని టిడిపి నగరి నియోజకవర్గ నాయకుడు పోతుగుంట విజయ్‌బాబు అన్నారు. టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమితులైన జి.ధనపాల్‌ను బుధవారం ఎంబి రోడ్డు లోని తన కార్యాలయంలో ఆయన శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం నుంచి దళితులైన జి.ఎం. సి.బాలయోగికి లోక్‌సభ స్పీకర్‌గా, ప్రతిభా భారతికి అసెంబ్లీ స్పీకర్‌గా అవకాశం కల్పించినఘనత తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. సన్మాన గ్రహీత ధనపాల్ మాట్లాడుతూ తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. తనకు పదవికి రావడానికి కృషి చేసిన విజయ్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోరాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పెమ్మసారి సుమన్ నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇ.రవినాయుడు, సూపర్‌బజార్ ఛైర్మన్ చంద్రయాదవ్, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు అరవ ప్రకాశ్, పుత్తూరు రూరల్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు పరంధామ్, మాజీ కౌన్సిలర్ గోపి ఆచ్చారి, నాయకులు వంశి, మధుసూదన్‌రాజు, రమేష్, మణి, అప్పయ్య, బాబు రాయల్, దాము రాయల్ పాల్గొన్నారు.

# నారపరాజుకండ్రిగలో తాగునీటి సమస్య

విజయపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : మండలంలోని నారపరాజుకండ్రిగలో తాగు నీటి సమస్య నెలకొంది. రెండు వారాలుగా తాగు నీరు సక్రమంగా పంపిణీ కాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. నీటిసరఫరా జరిగే బోరు బావి ఎండిపో వడం వల్ల సమస్య ఏర ్పడింది. ప్రస్తుతం వ్యవసాయ బోర్ల నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నామని అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

# జిల్లాను నెంబర్‌వన్ స్థానంలో నిలపడానికి కృషి

**- ఇతర జిల్లాల నుండి కొత్తగా వచ్చిన ఎంపిడిఓలతో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు**



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు జిల్లాకు కొత్తగా విధుల్లో చేరడానికి వచ్చిన ఎంపిడిఓలను కోరారు. వైఎస్ఆర్ కడపజిల్లా, ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లాల నుండి 32 మంది ఎంపిడిఓలు ఎన్నికల బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు బదిలీలపై వచ్చిన ఎంపిడిఓలు గురువారం జడ్పీ ఛైర్మన్ ఛాంబర్‌లో జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ ఎంపిడిఓలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సంపూర్ణ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్ళి పథకాల విజయ వంతంకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, స్త్రీ శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ భారతి, జడ్పీ డిప్యూటీ సిఇఓ ఆదిశేషారెడ్డి, పలమనేరు డిఎల్‌డిఓ ఉమావాణి, పాకాల జడ్పీటిసీ నంగా పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# భార్యభర్తలకు ఏడాదిన్నర జైలు

పాలసముద్రం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: పాలసముద్రం మండలానికి చెందిన భార్యభర్తలు గోపి, చందమ్మలకు చిత్తూరు జూనియర్ సివిల్ కోర్టు బుధవారం ఏడాదిన్న జైలు, 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. మండలంలోని కృష్ణజిమ్మాపురం పంచాయతీ కొండం గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం పుష్పరాజ్ కుటుంబానికి గోపి, చందమ్మలకు 5 సెంట్ల భూమి కోసం ఘర్షణ జరిగింది. ఈ కేసు విషయంపై పుష్పరాజ్ గోపి, చందమ్మలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు తరలించారు. ఈ మేరకు విచారించిన కోర్టు గోపి, చందమ్మలకు ఏడాదిన్న జైలు, 2 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

# ఘంటసాల విగ్రహానికి పుష్పాంజలి



తిరుపతి, ఫిబ్రవరి 1ప్రభాతవార్త: ప్రతినెలా మొదటిన అమరగాయకుడు ఘంటసాల విగ్రహానికి గురువారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు నీళ్ళతో, పాలాభిషేకం చేశారు. అనంతరం పూలమాల వేసి నివాళు లర్పించారు. ఘంటసాల తెలుగుప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిన గాయకుడని కొనియాడుతూ నగరంలోని భవానీనగర్‌కూడలిలో ఉన్న ఘంటసాల విగ్రహానికి రాయల సీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు కెఎన్ రాజా, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఆంజనేయులు, చంద్రశేఖర్, కస్పాపద్మనాభం, ఉపాధ్యాయుడు తిరుమలయ్య తదితరులు పుష్పాంజలి ఘటించారు.

# కమిషనర్ బంగ్లా నిర్మాణాన్ని పరిశీలించిన కమిషనర్ అధితి సింగ్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కమిషనర్ బంగ్లా పనులను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అధితి సింగ్ అధికారులకు సూచించారు. తిరుపతి ఎస్వీ యూనివర్శిటి ప్రాంగణం దగ్గర వున్న మున్సిపల్ కార్పొరేషన్‌కి చెందిన స్థలంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషణర్ కోసం నిర్మిస్తున్న బంగ్లా నిర్మాణ పనులను గురువారం సాయంత్రం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటికే మొదటి స్లాబ్ పూర్తి అయ్యిందని, రెండవ స్లాబ్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలియజేసారు. కమిషనర్ బంగ్లా స్కెచ్‌ని పరిశీలిస్తూ పనులు వేగవంతం చేయాలని కమిషనర్ అధితి సింగ్ సూచించారు. కమిషనర్ వెంట తిరుపతి నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ తిరుమాలిక మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారి సేతుమాధవ్ వున్నారు.

# డిఎస్పీల బదిలీలు

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జిల్లా పోలీసు శాఖలో డిఎస్పీలుగా విధులు నిర్వహిస్తున్న పలువురిని డిజిపి కె.రాజేంద్రనాథ్‌రెడ్డి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాసమూర్తిని తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి క్రైమ్ డిఎస్పీగా బదిలీ అయ్యారు. అలాగే చిత్తూరు ఎస్బి డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వి.శ్రీనివాసరెడ్డిని నాయుడుపేట డిఎస్పీగా బదిలీ చేశారు. అలాగే పలమనేరు డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని ఆళ్ళగడ్డ డిఎస్పీగా బదిలీ చేశారు. నగరి డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌ను కడప డిటిసి డిఎస్పీగా బదిలీ చేశారు. అలాగే దిశా డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బాబుప్రసాద్‌ను కర్నూలు దిశా డిఎస్పీగా బదిలీ చేశారు. చిత్తూరు డిఎస్పీగా రాజగోపాల్‌రెడ్డినియమితులయ్యారు. నాయుడుపేటలో డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డిని చిత్తూరు డిఎస్పీగా నియమిస్తూ డిజిపి ఉత్తర్వులు జారీ చేశారు. కుప్పం డిఎస్పీగా బి.శ్రీనాథ్ బదిలీపై వచ్చారు. శ్రీనాథ్ భీమవరం డిఎస్పీగా విధుల నిర్వహిస్తూ కుప్పంకు బదిలీపై వచ్చారు. అలాగే కర్నూలు దిశా డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఐ.సుధాకర్‌రెడ్డి చిత్తూరు దిశా స్టేషన్ డిఎస్పీగా బదిలీ అయ్యారు. నంద్యాల డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న సి.మహేశ్వరరెడ్డి పలమనేరు డిఎస్పీగా బదిలీపై వచ్చారు. చిత్తూరు ఏఆర్ డిఎస్పీగా మహబూబ్‌భాషా నియమితులయ్యారు. చిత్తూరు ఏఆర్ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మురళీధర్ కడపకు బదిలీ అయ్యారు. అన్నమయ్య జిల్లాలో ఏఆర్ డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్‌భాషాను చిత్తూరు ఏఆర్ డిఎస్పీగా బదిలీ అయ్యారు.

# ప్రజల ఆకాంక్షమేరకు సేవచేస్తున్నా

**-తిరుపతి ఎంపిగా అవకాశం స్వామివారి కృపే-డాక్టర్ గురుమూర్తి**



తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి: దేవదేవుడు శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రజలకు మూడేళ్ళుగా సేవలందిస్తున్నానని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు నిత్యం అందు బాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింతగా ప్రజాసేవ చేసుకునే భాగ్యం కలుగుతుం దన్నారు. ఇప్పటికే తిరుపతి ఎంపి అభ్యర్థిగా తనపై నమ్మకంతో ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరోసారి టిక్కెట్ కేటాయించారన్నారు. తిరుమలేశుని ఆశీస్సులతోనే తనకు అవకాశం కలిగిందన్నారు. ప్రజలను కలిసి మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా నన్నారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# ప్రజలందరిపై దేవుని ఆశీస్సులు కలగాలి -శ్వేత డైరెక్టన్ భూమన్



తిరుమల, ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి: తిరుపతిలో ఉంటున్న ప్రజలపైనేగాక రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలని స్వామివారిని వేడుకున్నట్లు శ్వేత డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి (భూమన్) తెలిపారు. శ్వేత డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా గురువారం ఉదయం దంపతు లిద్దరూ తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో స్వామివారిని దర్శించుకుని, కానుకలు సమర్పించారు. రంగ నాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# జీతెలుగులో 4న...సూపర్‌జోడీ రెండవ ఎపిసోడ్

తిరుపతి, ఫిబ్రవరి 1ప్రభాతవార్త: తెలుగుప్రేక్షకులకు వినోదాలతో సరికొత్త ఎపిసోడ్‌లతో ఎంతగానో అలరిస్తున్న జీతెలుగు ఛానల్‌లో 4వతేదీ ఆదివారం రాత్రి 9గంటలకు సూపర్‌జోడీ రెండవ ఎపిసోడ్ ప్రసారం కానుందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. సరికొత్త నాన్ఫిక్షన్ షో సూపర్‌జోడీ, సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షోగా ఘనంగా చేసిన ఈ షో రెండవది కూడా ఆదివారం ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. ప్రతిభ, అందం, వినోదం సమ్మేళనంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేస్తోందన్నారు. టాలీవుడ్ నటుడు సందీప్ కిషన్ భాగం కానున్న సూపర్‌జోడీ ఆదివారం ప్రసారం చూడాల్సిందేనన్నారు.

# శివయ్య సన్నిధిలో అఖండ శివనామ సంకీర్తన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జానపద వృత్తి కళాకారులు ఏడాదిగా నిర్వహించిన ఉద్యమ, పోరాటాలకు ఫలితం దక్కిందని చెప్పవచ్చు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని త్రినేత్ర అతిథి గృహం పక్కనే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కళావేదికపై అఖండ శివనామ సంకీర్తన కార్యక్రమాలను అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి కార్యక్రమాలకు జ్యోతి ప్రజ్వాలన చేసి శ్రీకారం చుట్టారు. గురువారం తిరుపతి, నెల్లూరుజిల్లాకు చెందిన జానపద వృత్తి కళాకారులు శివనామస్మరణతో పరిసరాలను హోరెత్తించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అధ్యక్షుడు బంగారుమురళి, జిల్లా కన్వీనర్ సంక్రాంతి వెంకటయ్య, గెడివేణు తదితరులు సారథ్యంలో వందలాది కళాకారులు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, **POTURAJULA VENKATESULU** (old name), R/o: 1/71-A Darjipalli, Vontimitta, YSR Dist.A.P. Have chnaged my name as **POTURAJU VENKATESH** (New Name) S/o Poturaju Chinnabbi.

**CHANGE OF NAME**

I,**POTURAJULA RAVIKUMAR** (old name), R/o 36/656-4-3, Street Number S10, Ashok Nagar, Cuddapah Dist. A.P. Have changed my name as **POTURAJU RAVI KUMAR** (New Name) S/o Poturaju Venkatesh